# చక్రాల చీర

## గుత్తుల భాస్కరరావు



పానకాలరావు ఆరుగంటలవేళ ఆఫీసయింతర్వాత పేవ్‌మెంట్‌మీద పడ్డాడు. పండగ అడ్వాన్సు నూటయాభై రూపాయలు పాంటు జేబులో మరోసారి తడిమిచూసుకున్నాడు ఖరీదైన షాపుల్లోంచి దూకిన వెలుగుల్లో నడుస్తున్న పానకాలరావు ఠక్కున ఆగిపోయాడు.

అదో బట్టల షోరూం. అతన్ని ఆపిన ఘనత షోకేసులో బొమ్మది. జిగ్ జిగేల్మనే జలతారు కాంతుల్లో బొమ్మ కళ్ళు చెదరగొడ్తోంది. బొమ్మకు కట్టిన చక్రాల చీర అతన్ని విపరీతంగా ఆకర్షించింది. రెప్పవాల్చకుండా అలా చూస్తుండిపోయాడు. బొమ్మ ఒళ్ళంతా చక్రాలమయం. జానెడు జానెడు వ్యాసంతో చక్రాలు గిర్రున తిరుగుతున్నట్టు ఫీలయ్యాడు. తన బుర్రనో, చక్రంవేసి బెట్టువేసి తిప్పుతున్నట్టు ఏవి చక్రాలు? ఎత్తైన వక్షంమీద కుడివైపో చక్రం-ఎడమవైపో చక్రం-ఓ పక్కగా చూస్తే అంతే వంపున్న జఘనంమీదకుడివైపో చక్రం - ఎడమవైపో చక్రం-

బొడ్డునో చక్రం-యిలా ఎక్కడుండాలో అక్కడ ఒకో చక్రం అమరుతూ ఒళ్ళంతా విస్తరించాయి. పానకాలరావుకి అద్దాలు బద్దలుకొట్టుకొని బొమ్మను చేరుకోవాలన్నంత ఉత్సాహం పుట్టింది. జేబులో డబ్బు గుర్తొచ్చి-చీరని సొంతం చేసుకొని వెంకటలక్ష్మిచేత కట్టించి ఈ అందచందాలు తనపరం చేసుకోవాలనుకున్నాడు.

ఖరీదెంతో చూద్దామని అతను ఓ అడుగు ముందుకు వేసాడు. చీరకొంగు చివరకట్టిన లేబిల్ మీద వందరూపాయల అంకె చూసి అతని కళ్ళు తిరిగాయి. వంద. అంటే ఒకటి పక్కన రెండు చక్రాలు. ఈ చీర మీద షాపుఅద్దె, ఎస్టాబ్లిష్మెంటు, కరెంటుఖర్చు, లంచాలు -చివరికి షోకేసులో బొమ్మ ఖరీదు కూడా రుద్దినట్టు తోచింది.

అయినా సరే చీర కొనాలన్న కోరికని చంపుకోలేదు పైగా వెంకటలక్ష్మికి తను రెండు చీరలు బాకీ. దీపావళికో చీర, సంక్రాంతికోచీర. డబ్బుల్లేక అప్పట్లో 'కొనుగోలు' వాయిదావేసాడు. యిప్పుడీ చీర కొనితీరాలి. కొంటే అది పదిచీరలపెట్టు - అనుకున్నాడు.

'ఏమిటి మాస్టారూ మా బొమ్మని తినేస్తున్నారు' అన్న ప్రొప్రయిటరు మాటలకి ఉలిక్కిపడ్డాడు పానకాలరావు. 'అబ్బే ఏం లేదండి' అన్నాడు. 'ఏమీ లేకపోవడం ఏమిటి ఆ చీరమీద మోజు పడ్డారు అవునా' అన్నాడు అతను. కాదనలేక మందహాసం ఒకటి ప్రదర్శించాడు వెంటనే పానకాలరావుని లోపల కూర్చోబెట్టి ఒక కుర్రాణ్ని అందులో రంగులు చూపించమని బెత్తాయించాడు. అతను చూపించిన అరడజను రంగుల్లో గులాబీరంగు చక్రాలచీర తీసుకొని వంద ముట్టజెప్పి యింటిముఖం పట్టాడు పానకాలరావు

'ఈ చీర కట్టిన తర్వాత వెంకటలక్ష్మి-వెంకటలక్ష్మి కాదు. చైతన్యలక్ష్మి! చక్రాలలక్ష్మి!! నీరసం గీరసం పక్కకునెట్టి షోకేసులో బొమ్మలా పొగరుగా ఉంటుంది. ముందు తన మనస్తత్వంలో గొప్ప మార్పొస్తుంది. వెంకటలక్ష్మి ముగ్గురుపిల్లల తల్లని మరిచిపోతాడు! తన కళ్ళకి పడుచు బొమ్మలా అవుపిస్తుంది' ఈ తరహా ఆలోచనల్తో చకచకా యింటికి చేరాడు

వంటింటి వలయంలో చిక్కుకుపోయి పొగచూరిపోయిన వెంకటలక్ష్మిని రెక్కపుచ్చుకొని లైటువెల్తురులోకి లాక్కొచ్చాడు. పుల్లలు మండడంలేదని మండిపడాలనుకున్న వెంకటలక్ష్మి అతని చేతిలో పాకెట్ చూసి నోరుకట్టేసుకుంది. పిల్లలు వాళ్ళిద్దరి చుట్టూచేరి అల్లరి ప్రారంభించారు.

పానకాలరావు అందర్నీ కళ్ళు మూసుకోమని పురమాయించాడు. అంతా మూసుకున్నారు. పాకెట్ తెరిచి 'తెరవండోచ్' అన్నాడు. తెరిచారు:




గుండెలు దడదడలాడుతుంటే వెంకట లక్ష్మి చీర చేతుల్లోకి లాక్కొని ఒంటి మీద విరబోసుకుని 'అబ్బో చాలా బావుంద'నుకుంది. "ముందు కట్టుకురా" అతను ఆజ్ఞాపించాడు. 'ఊహు!యిప్పుడు కాద'ని ఆమె సిగ్గుపడింది 'కట్టుకు తీరాలి' అని అతను మొరాయించాడు. పిల్లలుకూడా తెలిసో తెలియకో 'అమ్మ కట్టాలి' అని అరిచారు.

చీరపుచ్చుకుని వెంకటలక్ష్మి వంటిం ట్లోకి దూరి తలుపులు బిగించుకొంది చకచక కట్టుకొని 'వస్తున్నా కళ్ళు మూసుకోండి' అని ఊరించింది. పాన కాలరావు, పిల్లలు వేళ్ళసందుల్లోంచి దొంగచూపులు చూస్తూ కళ్ళుమూసు కున్నారు

భళుక్కున తలుపులు తెరుచుకు న్నాయి.

దేవీ సాక్షాత్కారం అయింది.

పానకాలరావు కళ్ళుతెరిచి అవా క్కయిపోయాడు.

'ఒక్క చక్రం - ఒక్క చక్ర మయినా తను ఊహించుకున్నట్టు అమర లేదు. అమరడానికి నిండా ఒంపులేవి? చక్రాలు శక్తిలేక చైతన్యంలేక కదలక మెదలక ఉండిపోయాయి. యిరుసు విరిగి పక్కకి ఒరిగిపోయాయి. ఆ బొమ్మకి వెంకటలక్ష్మికీ ఎందుకింత తేడా,' ఆమెను నఖశిఖపర్యంతం చూసిన చూపులు-పక్కకు పాకి-జవా బుల్లా నిల్చున్న పిల్లలమీదపడి- బెదిరి పోయాయి.

చెంగు సవరించుకొనే ప్రయత్నంలో లేబిల్ చేతికితగిలి ఖరీదుచూసి ఆమె ఉలిక్కిపడింది. ఉగ్గురాలయింది. "అవ్వ! ఒక్క చీరకు వంద తగలే శారా? మీకు యింగితం ఉందా? మిగతా యాభైతో మీరేం తీసుకుంటారు? పిల్లలకేం తీస్తారు అయ్యో పండగ అడ్వాన్సు తగలబెట్టారు" అని వడగళ్లు కురిపించింది. విసుగ్గా చీర విప్పేయా లని వంటగదిలోకి పరుగెత్తింది

చక్రాలచీరలో షోకేసులో బొమ్మలా లేని భార్య చర్యలు గమనించేస్థితిలో లేడు-పానకాలరావు.